


# ఎర్ర త్రికోణం

అది పట్నంకాదు. అలాగని అది పల్లెటూరు మాత్రం కాదు. పెద్ద పల్లెలాంటి చిన్న పట్నం. అయినా దానికో చరిత్ర వుంది.

అధికారంలోవున్న అమాత్యులవారు ఆ వూళ్ళోనే అవతరించారు. వారికి ఓట్లిచ్చి అధికారం హస్తగతం చేసిన అధిక సంఖ్యాకులైన ఆకలి మనుషులున్నారు. వాళ్ళని నిత్యం దోచుకుతినే అల్ప సంఖ్యాకులైన అజీర్తి ప్రభువులున్నారు. వీళ్ళకు రోగాలొస్తే నీళ్ళు (అఫ్‌కోర్స్ ఎర్రనీళ్ళే!) మందులూ ఇచ్చేటందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వుంది. అది జనరల్ హాస్పిటల్‌లా పెద్ద భవంతిలో వుంది. అందులో మందులమ్ముకోడాన్కి మంచిమంచి డాక్టర్లున్నారు. వాళ్ళమ్మే మందులు కొనుక్కోడానికి అనతి దూరంలోనే పెద్ద పట్నం వుంది. రాకపోకలకి రైలుబళ్ళున్నాయి. అవి ఆగటానికి ఆ వూళ్ళో స్టేషన్ కూడా వుంది. అక్కడ అడుక్కోడానికి భారత దేశపు ముద్దుబిడ్డలు కోకొల్లలు.

ఆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పురుళ్లుపోయడం ఎప్పుడూ వినలేదు. పురుళ్ళు రాకుండా చేసేందుకు మాత్రం పెద్ద విభాగంవుంది. వాటి గోడలనిండా ఎఱ్ఱ త్రికోణపు ముద్రాంకితాలూ, ఇద్దరి పిల్లల తల్లి దండ్రుల పోస్టర్లూ వున్నాయి.

అక్కడ కుటుంబ నియంత్రణ వారోత్సవాలు జరుగుతున్నాయి. పిల్లలు పుట్టినందుకు ప్రజలూ (ధనికులు మాత్రమే) పుట్టకుండా చేస్తు న్నందుకు ప్రభుత్వమూ ఉత్సవాలు చేసుకొనటం పరిపాటి అయింది. అందుకే ప్రజల సొమ్ముతో ప్రభల తీర్థంలా వెలుగుతోంది ఆ వూరు.

ఆ భవనం నేత్రపర్వంగా రంగురంగుల కాంతుల్లో రంగ రించుకుంది. డాబా అంచులమీద రంగురంగుల విద్యుద్దీపాలు పరుగు లెడుతున్నాయి. అవి దివిసుంచిరాలిన దిక్కులేని చుక్కల్లా వున్నాయి. ద్వారం దగ్గర పెద్ద స్వస్తిక్ చక్రం తిరుగుతోంది. దానిక్రింద ఆప రేషన్ అంటే అదిరిపోతున్న అర్భకుడి హృదయ స్పందనలా ఎఱ్ఱ త్రికోణం వెలుగుతూ ఆరుతూ వుంది। పుట్టవల్సిన పిల్లలు పుట్టరు గనుక, వాళ్ల పుట్టిన రోజు సామూహికంగా చేసుకుంటున్నట్లుంది ఆ వాతావరణం.

లోపల డాక్టర్లు హడావుడిగా తిరుగుతున్నారు. వాళ్ళ గుండెలు 'లక్ష్యాలు—సాధనలు, లక్ష్యాలు—సాధనలు' అని కొట్టుకుంటున్నాయి.

'మంత్రిగారి స్వంతవూరులో కనీసం ఆరువేలయినా టార్గెట్ కావాలిట. లేకుంటే వారికి తీరని అవమానం అంటున్నారు' పెద్ద డాక్టరు ప్రకటన.

'అవును. ఇంకా రెండు వందలయినా కాలేదు' వ్రేలి ముద్రల వోచర్లు తిరగేస్తూ గుమస్తా సమాధానం.

టార్గెట్స్ । ఎచీవ్‌మెంట్స్ ।। టార్గెట్స్ । ఎచీవ్‌మెంట్స్ ।।'

'వెళ్ళండి ఊరిమీదికి...' శివమెత్తినట్టు అరిచాడు డాక్టర్.

డాక్టర్స్, బ్రోకర్స్, ప్రమోటర్స్ - కదిలిందొక మంద.

ముక్కోణపు రాజముద్రికలున్న వేన్లు (Vans) పరుగు లెట్టాయి.

హిరోషిమా మీద అణుబాంబు పడినట్లు దుమ్ము గగనాన్నంటింది.

* * *

వేళగాని వేళకు వచ్చినట్లు రైట్ టైమ్‌కు వచ్చింది రైలు.

ప్రయాణీకులు పల్చగా వస్తున్నారు బయటికి.

బిచ్చగాళ్లు మాత్రం బిజీగా తిరుగుతున్నారు.

'ఆకాశవాణి వార్తలు చదువుద్ది యెంకటేసు - ఆంధ్రలో పోరి గాళ్ళ సమ్మె. రైలోళ్ళకి బయమేసి రైట్టయిమ్కు వచ్చినుర్రి - దొరా ధరమం.'

'బెజవాడలో సోడాల యిద్ధం. తాగనాకి సోడా దొరక్క గుడుం బకి గిరాకీ - అమ్మా ఒక పైస'.

ఒక పైసా అయినా పడిందోలేదో, ప్రయాణీకులు మాత్రం వెళ్ళిపోయారు.

'ఇయవ్వ ! ఓ పైసయినా రాలేదియాల' గట్టిగానే అన్నాడు వెంకటేశు.

వేన్ ఒకటి దుమ్ము లేపుకుంటూ వచ్చి ఆగింది.

వార్తలు చదువుకుంటూ పరుగెత్తాడు వెంకటేశు.

నలుగురు వేన్ నుంచి దిగారు.

'బాబూ ధరమం'

'ఎన్ని పైసలు గావాల్రా నీకు'.

'నరసింబాబే అడగలేదు. మీరేంటి దొరా దరమానికి సీలిం గడ్తన్నారు.'

'హారి నీ ... అయితే అయిదు రూపాయలు'

'అమ్మ బాబోయ్! అయి నిజం పైసలేనా జపాను కాయితాలా?'

'నిజం పైసలేరా కారెక్కు'

అతనెక్కలేదు. ఎక్కించబడ్డాడు.

o o o

ఆఫీస్‌లో చిత్రగుప్తుడి వారసుడు.

'ఇక్కడ వేలిముద్ర వెయ్యి.'

'అయ్యోవ్. .నేనెయ్య'.

'పైసలొద్దా?'

'కావాల.'

'అయితే పట్టు వేలు'.

'ముద్ర మాత్రం వెయ్య'

'ఏం, తెగులా?'

'ఏలు ముద్దరలేసి మా అయ్య నన్ను రోడ్డుమీటి కొగ్గేసిండు.'

'నువ్వెవళ్లనీ ఒగ్గెయ్యక్కర్లా'.

'నేనెయ్య..'

'నువెయొద్దులే...'

అతనే వేలిముద్ర వేశాడు.

'తీసికెళ్ళండిరా వీణ్ని.'

యమకింకరుల్లాంటి నలుగురు తోటీలు వెంకటేశుని ఆపరేషన్

థియేటర్ కు ఈడ్చుకుపోయారు. అది మయసభో, మాయలోకమో అనిపించింది అతనికి.

దేవతవేషం వేసుకున్న రాక్షసుడిలా నుంచున్నాడు డాక్టర్.

'ఈ బల్లెక్కు.'

'బల్లెందుకు దొరా?'

'ఆపరేషన్ కు.'

'పైసలిస్తమని తోలుకొచ్చి ఆపరేషనేంటిదొరా'

'ఆపరేషన్ ముందు, పైసలు తర్వాత.'

'నే బీమారోణ్ని గాను.'

'ఇది బీమారాపరేషన్గాదు. బిడ్డలు పుట్టకుండ'

'నాకు పెళ్ళంలేదు.'

అనుమానంగా చూశాడు డాక్టర్.

'ఏం పనిచేస్తావు'

'రేడియం వార్తలు సదువుతా'

'ఏ స్టేషన్లో'

'రైలు టేసన్ లో

డాక్టరు నెత్తికొట్టుకున్నాడు.

'ఎవరక్కడ. ఆ ప్రమోటర్ని పిలు'

వచ్చాడు.

'ఏవిటి! బ్రిహ్మచారిని, అందులోను బెగ్గర్ని తెచ్చావు'.

'ఉభయ తారకం సార్'

'బెగ్గర్ మహరాజులు బ్రిహ్మచారులుగానే వుండిపోరు సార్. వాళ్ళకీ నరాలకి ఆకలైనప్పుడు బేగం సాయిబాలు వుంటారు, పిల్లలు పుడతారు. పుట్టినవాళ్ల గతి తప్పకుండ వాళ్ళ సామ్రాజ్యానికి వార

సులై కూర్చొంటారు. అందుకే ఉభయతారకం సర్. మనకి టార్జెట్స్ వాళ్ళకి పైసలు. అసలు నన్నడిగితే మొట్టమొదట బెగ్గర్ పాపులేషన్ అరికట్టాలి సర్. అప్పుడే తలసరి ఆదాయంలో లీకేజెస్ నిల్చిపోతాయి' అన్నాడు పరిమోటర్‌గా బ్రతుకు వెళ్ళబుచ్చుతున్న టి క్రేట్ ఎకనమిస్ట్.

డాక్టర్‌కి ఆ సాహిత్యం అర్థంకాలేదు. అర్థమైనట్లు కన్పించటానికి ప్రయత్నిస్తున్నాడు.

'కానీయండి సార్' వెళ్ళిపోయాడు.

'ఎత్తండి వీణ్ని బల్లమీదికి'

తోటీలు సాయంపట్టేశారు.

శవంమీద కప్పినట్లు అతనిమీద లినెన్ కప్పారు.

రెండుసార్లు లేవబోయాడు వెంకటేశు. తల బల్లకేసి నొక్కిపట్టారు.

గాజుల గలగలతెరుగని వెంకటేశు 'వాస్' మీద కత్తులు కదంతొక్కాయి.

పురుడు కష్టమైన స్త్రీ నొప్పుల్లో అరిచినట్టు కెవ్వుమన్నాడు.

ఆ తర్వాత ప్రసవానంతరం నిట్టూర్పులా నీరసంగా మూలిగాడు.

* * *

రికెట్ పేషెంటులా ఆఫీస్‌గదిలోకి నడిచి వచ్చాడు వెంకటేశు.

రెండురూపాయలు అతని చేతిలో పడ్డాయి.

'అయిటి స్తవన్నారు?'

ముద్దరెయ్యలేదుగామరి'

'వేస్తా'

'ఇప్పుడొద్దులే పో..'

o o o

రాత్రి ఎనిమిది గంటలయింది. కాళ్ళీడ్చుకుంటూ వచ్చి పీరు సాయిబు మాంసం కొట్టుదగ్గర కూలబడ్డాడు వెంకటేశు. గుంటూరు కారం కూరినట్లు మండుతోంది గాయం. కట్టు చేతితో తడుంకొన్నాడు. తడిగా తగిలింది. చూసుకున్నాడు. ఎఱ్ఱ త్రికోణం కంటె మిన్నగా వోడుతోంది నెత్తురు.

పుండు సూదుల్తో పొడుస్తున్నట్లుంది. 'డాక్టరిప్పుడే ఆపరేషను షురూ చేసిండా, లేక పీరుసాయేబు మేకల్దొరక్క నన్నే కోసేస్తున్నడా' అనుకున్నాడు.

మూలుగుతూ మూసిన షట్టర్స్ పక్కన ఒరిగాడు. బాధ పెరుగుతున్నది. నడ్డిమీదనుంచి కారెళ్ళిన వూరకుక్కలా గిలగిల లాడాడు. తట్టుకోలేక లేచి కూర్చున్నాడు. ఎదురుగా నర్సింగ్‌హోమ్ కనిపించింది.

వెంకటేశుకు ఆ త్రాతలేని ఆలోచనొచ్చింది. మెల్లగా లేచాడు.
అక్కడున్న పేషెట్లంతా ఆకలెరుగని అదృష్టవంతులే.
క్రింద ఒక మూల ఒదిగి కూర్చున్నాడు.

పక్షపాతం ఎరుగని మానవాతీతుడిలా అతణ్ణి వరుసప్రకారం పిల్చాడు డాక్టర్. 'ఏం జబ్బు?' డాక్టర్‌లానే అడిగాడు.

వెంకటేశు పేషెంటులా చెప్పలా. తనపైన హత్యాప్రయత్నం జరిగినట్టు కంప్లెయింట్ చేశాడు.

'ఇది పోలీస్ స్టేషన్ కాదు. నీ బాధేమిటో చెప్పు.'

చెప్పాడు.

కట్లువిప్పి చూశాడు డాక్టర్. నెత్తురు స్రవిస్తున్నది. కుట్లు కూడ వేసినట్లు లేదు.

'ఆపరేషన్ సరిగా చేయలేదు. మళ్ళా చేసి కుట్లు వెయ్యాలి. లేకుంటే సెప్టిక్ అయి అన్యాయంగా చచ్చిపోతావు.''

వెంకటేశు ఏడుపు లంకించుకున్నాడు.

''ఏం పనిచేస్తావు ?''

'రైల్టేసన్‌లో అడుక్కుంటా దొరా'

'పైస లెన్ని వున్నాయి ?'

'రెండు రూపాయలు దొరా'

'నా ఫీజు పాతిక రూపాయిలు తెల్సా?'

'గులాపోణ్ని దొరా సచ్చిపోతన్నా' కాళ్లు పట్టుకున్నాడు.

కాళ్లు వెనక్కి లాక్కుని 'ఇది ధర్మాసుపత్రికాదు. పైసలిచ్చే వాళ్ళకే ఇక్కడ వైద్యం. వాళ్ళెన్ని పైసలిచ్చారు'

'రెండ్రూపాయ లిచ్చిన్రు దొరా'

త్వరగా కట్టు కట్టేశాడు. తలుపు తెరచి 'ధర్మాసుపత్రికెళ్లు' అని బయటికి నెట్టి 'యస్ .. నెక్స్ట్' అన్నాడు.

* * *

అర్ధరాత్రి. వీధిలో దీపాలు పేదవాడి ఆశల్లా వెలుగుతున్నాయి. స్టేషన్‌లో రైలాగిన చప్పుడయింది. లేచి వెళ్ళటానికి ప్రయత్నించాడు. నరాలు స్వాధీనం తప్పినట్లయింది 'అమ్మా' అని కూలబడ్డాడు.

వీధిలో గస్తీ పోలీస్‌దృష్టి అతనిమీద పడింది.

'రేయ్.. ఎవడ్రా నువ్వు'

'నేను దొరా... నీ బాంచను' అన్నాడు మూలుగుతూనే.

'బడాచోర్ ఇక్కడెందుకు తొంగున్నావ్ ?'

'పెయ్యి బాగులేద్దొరా'

'తెత్... దొంగ... లే ఆడనుంచి'

కుక్కని తన్నినట్లు తన్నాడు.

'సచ్చినా దొరా' అని అరిచాడు.

'ఛల్. ఈడనుంచి పోబే...'

'లేలేను దొరా ... అపరేసన్జేసిన్రు'

'నీకేం ఆపరేషన్...'

'సర్కారాపరేషన్ దొరా'

'అయితే పైసల్ దండిగుంటయే'

దుప్పట లాగి బట్టలన్నీ వెతికి సంచి బయటకు తీశాడు.

'తూత్... రెండు రూపాయిలా'' జేబులో పెట్టుకున్నాడు.

'అకలేస్తున్నది. ఆ పైసలియ్యి దొరా ?'

'ఏం దమా కరాబయిందా. జవానిచ్చుకున్న పైసల్ వాప సిమ్మంటవు' ఒక్క తన్నుతో ముందుకు బోర్లపడ్డాడు వెంకటేశు.

కానిస్టేబులు ఇనపదెక్కలు ప్రయోగించుకుంటూ నిష్క్రమించాడు.

అలాగే బోర్ల పండుకున్నాడు వెంకటేశు.

గాయం కత్తితో కెలికినట్లయింది.

కట్టులోపల ముళ్ళపంది వెంట్రుకలు విప్పి గిరగిరా తిరుగుతున్నట్లు అవ్యక్తమైన సలుపు.

మేధస్సు పనిచేయటం మానుకుంది.

మైకంవచ్చి కళ్లు మూసుకున్నాడు.

వాతమో మరేదో... కమ్మింది.

దూరంగా ఎక్కడో తీతువు కూసింది.

★